

కథా కౌముది

# కౌగిలింత

డా.కలశపూడి శ్రీనివాసరావు

"ఈ అమ్మాయి మిమ్మల్ని కౌగిలించుకుందా?" అని కోర్టులో జడ్జి ఒక అందమైన అమ్మాయిని చూపిస్తూ, బోనులో నిలబడి ఉన్న 50 ఏళ్ల అతనిని సూటిగా అడిగారు.

"అవును" అన్నాడు అతను.

అతనిని బయట చూస్తే, ఉన్నత అధికారో, ప్రొఫెసరో, డాక్టరో, లాయరో అనుకుంటారు. అతని వేషభాషలు, సున్నితంగా చూసే కళ్ళు, విశాలమైన నుదురు అలాంటి ఆలోచనలను కలగజేస్తాయి.

కోర్టులోని వారందరూ ఆశ్చర్యపోయారు. ఆశ్చర్యం కోర్ట్ హాల్‌ను నిశ్శబ్దంగా మార్చింది. ప్రశ్న అడిగిన జడ్జి స్తబ్దులు అయ్యారు. సదరు అమ్మాయితో తన కొడుకుకి విడాకులు కావాలని కేసు వేసిన ఆ అమ్మాయి అత్తగారు, కేసు వాదిస్తున్న లాయర్ మాత్రం విజయం సాధించామన్న గర్వం మొహం అంతా పులుముకుని, ఆ మొహాన్ని అందరికీ చూపించాలన్న ఆశతో కోర్టులో ఉన్న అందర్నీ చూశారు.

తన కొత్త కోడలు ప్రవర్తన నచ్చక, అత్తగారు తన కొడుకుకి విడాకులు కావాలని పెట్టించిన కేసు ఇది. 'అజంతా బొమ్మకి ప్రాణం పోసి నవ్వుతూ నడిచి రమ్మంటే వచ్చేలాంటి పిల్ల' అని చెప్పి కొడుకుని ఒప్పించి, నలుగురితో చెప్పి మురిసిపోయి, ఆర్భాటంగా పెళ్లి చేయించి, 'ఈ పిల్ల మా పిల్ల, మీ పిల్ల కాదు' అని పదేపదే చెప్పి తన విశాల హృదయాన్ని, ఆధునిక భావాలను ఆనందంగా హోలీ రంగులలాచల్లింది అత్తగారు పెళ్ళికి వచ్చిన వారి పైన.

కానీ కొద్ది నెలల్లోనే, 'అజంతా బొమ్మ' తన అంతంత మాత్రం ఉద్యోగంతో తమ చిన్న ఇంటిని పెద్దదిగా మార్చలేదని, తన అడుగులో అడుగు వేస్తూ సమాజంలో తన స్థాయిని పెంచలేదని, అవేవీ చేయలేకపోయినా కనీసం

ఆనందంతో అంట్లు తోమదని, స్త్రీ వాద కథలు, సినిమాలు, టీవీ చర్చలు, ఆర కొరగా కలిగించిన ఆవేశం వలన కొరకంచుల తయారైన సగటు ఆడపిల్ల అని తెలుసుకొని ఎంతో నిరాశ చెందిన అత్తగారుతన ఆశలను సాధించుకోవడానికి కొత్త మార్గాలను వెతికింది. అజంతా బొమ్మ తనంత తానే మళ్లీ జీవనలేని బొమ్మ అయి కోడలి స్థానం ఖాళీ చేయడమే సరి అయిన మార్గం అని గ్రహించింది. దానికోసం ఆమె ఏ ఆలోచన చేసింది, వాటిని ఎలా అమలు చేసింది అదంతా వివరంగా రాస్తే స్త్రీకి స్త్రీయే శత్రువు అన్న సిద్ధాంత వ్యాసం అవుతుంది.

ఆమె ప్రయత్నాలు ఫలించి అజంతా బొమ్మ తనకు తానుగా ఇల్లు విడిచి వెళ్లిపోయింది. కానీ అత్తగారికి తన ఆశల్ని సాధించుకోవడానికి స్వతంత్రం రాలేదు. ఏందుకంటే, అజంతా బొమ్మ సంప్రదాయాల ప్రకారం చట్టబద్ధంగా జరిగిన పెళ్లి ద్వారా వచ్చింది. అందుచేత అత్తగారు లాయరుని ఆశ్రయించి, కోడలిపై విడాకుల కోసం కేసు వేయించింది.

పెళ్లి జరిగిన తర్వాత వాళ్ళ ఇంటికి వచ్చి ఉన్న కొద్ది నెలల్లో జరిగిన ఏ విషయం విడాకులు ఇప్పించే వాటికి సరిపోయే కారణాలు కావని లాయర్ చెప్పాడు. అయితే, కేసు వదులుకోవడం ఇష్టం లేని లాయరు మరొక ఉపాయం చెప్పాడు. 'మీ కోడలు అజంతా బొమ్మన్నారు కాబట్టి, ఆమెకి ఎంతోమంది తెలిసి ఉండవచ్చు, ఆ పరిచయాలలో ఏ విషయమైనా మనకు అనుకూలంగా ఉంటే, దానిని ఉపయోగించి విడాకులు తెచ్చుకోవచ్చు' అని చెప్పాడు.

కోతికి కొబ్బరికాయ దొరికినట్టు, అత్తగారికి ఈ కొత్త కోణం దొరికింది. కొడుకు ద్వారా అజంతా బొమ్మ పెళ్లికి ముందు సంబంధాలు అన్నిటిని వివరంగా తెలుసుకుంది. వాటిని లాయర్ కి అందించింది. వాట్సఅప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిలో దొరికిన వాటిని ఆధారాలుగా పెట్టి కేసు వేశారు. కోర్టులో వాదోపవాదాలు విన్న జడ్జిగారు అవన్నీ పెళ్ళికి ముందు జరిగినవి కాబట్టి, పూర్తి సంప్రదింపుల తర్వాతే పెళ్లి చేసుకున్నారు కాబట్టి, అందుచేత విడాకులు ఇప్పించడం జరగదని చెప్పారు. పెళ్లి అయిన తర్వాత జరిగిన వాటిని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు.

ఒక మనిషి, మరో మనిషి ఆలోచనలను, ఆశలను, అంతరంగాలను ప్రేమతో సులభంగా తెలుసుకోవచ్చు. అది వీలు కానప్పుడు, చేతకానప్పుడు మరొక బండ పద్ధతిలో తెలుసుకోవాలంటే, ఈ కాలంలో ఆ మనిషి తాలూకా ఫోన్ ద్వారా తెలుసుకోవడం కొంతవరకు సాధ్యం. విడాకులు రావడానికి సహాయపడే ఏదైనా ఒక గట్టి సాక్ష్యం దొరుకుతుందేమో అని కోడలి ఫోన్ తీసుకుని పరిశీలించింది అత్తగారు. కోడలు ఆనందంతో ఆమె వైపు బంధువుల్లో ఒకరిని కౌలించుకుంటున్న ఫోటో ఒకటి ఫోన్లో దొరికింది. అది లాయర్ కి చూపించింది. లాయర్ మనం కేసు గెలుస్తాం అని ఆమెకు ధీమా ఇచ్చాడు. ఆ విషయాన్ని ఇప్పుడు జడ్జి పరిశీలిస్తున్నారు. ఆ ఫోటోలో ఉన్న వ్యక్తే ఇప్పుడు కోర్టు బోనులో ఉన్నాడు. అతనిని జడ్జి సూటిగా అడిగిన 'ఈ అమ్మాయి మిమ్మల్ని కౌగిలించుకుందా?' ప్రశ్నకి సమాధానంగా 'అవును' అన్నాడు.

కోడలు పరాయి వ్యక్తిని కౌగిలించుకోవడం, ఆ వ్యక్తి ఒప్పుకోవడం వలన ఆరోపణ నిరూపించబడ్డది కాబట్టి, జడ్జి విడాకులు ఇప్పిస్తారు అని కోర్టులో ఉన్న అందరూ అనుకున్నారు.

జడ్జి కొద్దిసేపు తటపటాయించి, సాక్ష్యం ఇచ్చిన అతని వైపు చూసి, "ఇది విడాకుల కేసు. మీ సాక్ష్యం వలన ఆమె జీవితంలో పెద్ద మార్పు రాబోతున్నది. ఇది మీకు అర్థమైందా?" అని అడిగాడు.

“అర్థమైంది. కానీ ఆమె నన్ను కౌగిలించుకోలేదని అబద్ధం చెప్పలేను. ఆమె ఎందుకు కౌగిలించుకుంది అన్నది మీకు అర్థమైతే నేను ఇచ్చిన సాక్ష్యం మీరు విడాకులు మంజూరు చేయడానికి పనికిరాదు” అన్నాడు అతను.

జడ్జి ప్రతి కేసు తనకి బాగా అర్థమవుతుందని, కేసు తీసుకొచ్చిన లాయర్లకు కానీ, కేసు పెట్టిన వారికి కానీ అర్థం కాని విషయాలు ఎన్నో ఉంటాయి అన్నది జడ్జిగారి స్థిరమైన అభిప్రాయం. అలాంటి ఆయన్ని ఈ కేసులో ముఖ్యమైన సాక్ష్యం ఆయనకే అర్థం కాదని చెప్పడంతో జడ్జి గారికి రవంత కోపం, ఆశ్చర్యం, పంతం ముప్పేట వచ్చేయ్. అయినా సరే తమాయించుకుని, తన విశాల హృదయాన్ని, అందరికీ చూపించాలని, “కౌగిలింతలో ఎన్ని రకాలు ఉంటాయి?” అని కొంత అవహేళనతో అడిగాడు.

“కౌగిలింతలు తీవ్రత, సందర్భం ఆధారంగా వేర్వేరు రీతుల్లో ఉంటాయి. మానవ సంబంధాలలో భావోద్వేగాల సంక్లిష్టతను అవి ప్రతిబింబిస్తాయి. వాటిలో కామంతో కూడిన కౌగిలింత కేవలం ఒక రకమే. స్వచ్ఛమైన భావోద్వేగాలతో మనుషులు పరస్పరం కౌగిలించుకునే సన్నివేశాలు ప్రతిరోజు ఎన్నో జరుగుతూనే ఉంటాయి. రామాయణం, మహాభారతంనుండి నేటి సాహిత్యం దాకా పరిశీలిస్తే, ఈ కౌగిలింతలన్నీ అందరికీ అర్థం అవుతాయి. కానీ మనం నేటి తెలుగు సినిమాలో కౌగిలింతలు చూసి కౌగిలింత అంటే అదే అనుకోవడం మానవ మేధస్సుకు సిగ్గుచేటు.” అని అతను ఇకపై మీ ఇష్టంఅన్నట్టుజడ్జి వైపు చూశాడు.

ఆ చూపులు చూసి జడ్జి గాబరా పడ్డారు. అర్థం కాక అత్తగారు, లాయరు కూడా గాభరా పడ్డారు.

ఎన్ని రకాల కౌగిలింతలు ఉంటాయి అని కోర్టులో ఉన్న వారందరికీ కుతూహలం కలిగింది. నోరు విప్పి అడగకపోయినా హవ భావాలతో ‘ఓహ’, ‘హ,’.. లాంటి శబ్దాలతో ప్రకటించారు. కోర్టులో మనుషుల హావ భావాలని అర్థం చేసుకోవడంలో అనుభవం ఉన్న జడ్జి వారి కుతూహలాన్ని అర్థం చేసుకున్నారు.

“మీరు అన్న ఎన్నో కౌగిలింతల్లో ఈ అమ్మాయి మిమ్మల్ని కౌగలించుకున్న కౌగలింత ఎటువంటి కౌగిలింతో చెప్పగలరా?” అని ఈసారి కుతూహలంతో అడిగారు జడ్జి.

“నా అనుభవంలోకి వచ్చిన కౌగిలింతలని మీకు క్లుప్తంగా చెబుతాను. అందులో ఈ అమ్మాయి నన్ను కౌగిలించుకున్న కౌగిలింత, ఏ కౌగిలింతో మీరే నిశ్చయించుకోండి” అన్నాడు అతను.

“సరే చెప్పండి” అన్నాడు జడ్జి.

“నా పెళ్లి అయిన కొత్తలో, మా పక్కింట్లో స్నేహ అనే అమ్మాయి ఉండేది. ఆమె అప్పుడే కాలేజీలో చేరింది. ఇంట్లో వారితో పంచుకోలేని ఎన్నో ఆలోచనలు, ఆశలు, కాలేజీ విషయాలు, స్నేహితులతో సంబంధాలను నాతో పంచుకునేది. కొద్ది కాలంలోనే మా ఇంట్లో పిల్లలా మెలిగింది. నేను విదేశాలకి వెళ్ళిపోతున్నానని తెలిసినప్పుడు, అప్పటిదాకా గలగల మాట్లాడుతున్న స్నేహ మూగబోయింది. జీవితంలో మేము మళ్ళీ కలవలేము అని అనుకుని ఉండవచ్చు. నేను వెళ్లే దాకా ఒక్క మాట మాట్లాడలేదు. కానీ ఆఖరి రోజున, వీడ్కోలుగా ఆమె కౌగిలించుకున్న కౌగిలింత ప్రత్యేకమైనది” అని ఆగి “పెళ్లికూతురు తన ఇంటిని వదిలి వెళ్ళిపోతూ తండ్రి, తల్లి, తనవైపు బంధువులను కౌగిలించుకోవడం అందరికి తెలిసిందే కదా” అన్నాడు.

అవును కదా అని పైకి అనకపోయిన ఆ భావాన్ని అందరి మొహాలలో అతను చూశాడు.

“ఏ పరిచయం లేని ఒక అమ్మాయి రైలులో కూర్చొన్న నా పక్కన వచ్చి కూర్చుని, నా కళ్ళల్లో కళ్ళు పెట్టి చూసి, మాట మాట్లాడకుండా గట్టిగా కౌగిలించుకుంది. తన వెనుక పడ్డ దుండగుల నుండి తనని రక్షించుకుందికి కౌగిలించుకున్నానని, హైదరాబాద్ చేరే దాకా తనకి రక్షణగా ఉండమని కోరింది. భయంతో కంపిస్తున్న ఆమె శరీరం సహజ స్థితికి వచ్చేదాకా అలా కౌగిలించుకునే ఉన్నాం. కొంతమంది కుర్రాళ్ళు వచ్చారు. మమ్మల్ని చూసి వెళ్ళిపోయారు. తన రక్షణ కోసం ఆమె కోరిన నా కౌగిలింత ఆ క్షణంలో ఎంతో ముఖ్యమైనది. ఆమె పేరు రూహి. ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడు మేము కలవలేదు” అని ఆగి కోర్టు హాల్ అంతా చూసి, మళ్ళీ చెప్పడం మొదలు పెట్టాడు.

“అమెరికాలో నాతో పని చేసిన అలెక్సిస్ అనే అమ్మాయికి హార్వర్డ్ యూనివర్సిటీలో సీటు వచ్చింది. నాతో పని చేయడం వల్ల ఆమెకి ఆ సీటు వచ్చింది అని భావించింది. ఆరోజు అలెక్సిస్ నన్ను కౌగిలించుకున్న కౌగిలింత కృతజ్ఞతా భావానికి ప్రతీక.

నా దగ్గర పనిచేసే మరొక అమ్మాయి దేబోరా ఎవరో ప్రేరేపించడం వల్ల నాపై లైంగిక వేధింపు చర్యల కేసు పెట్టింది. కేసు విచారణకు వచ్చినాడు తను చేసిన తప్పు తెలుసుకుని అందరి ముందు నన్ను వచ్చి కౌగిలించుకుని బోరుమని ఏడ్చింది. అది పశ్చాత్తాప కౌగిలింత.

చాలా ఏళ్ల తర్వాత హైదరాబాదులో కె.బి.ఆర్ పార్క్ ముందు, హఠాత్తుగా ఒకామె నన్ను కౌగిలించుకున్నారు. నాకు ఆమెకి ఉన్న సంబంధం సాహిత్యం మాత్రమే. మంచి రచయిత్రిగా, వివిధ రకాల పాత్రలతో నిరంతర సాన్నిహిత్యంతో మెలిగే ఆమెకు వచ్చే అనంతభావాలు మా సాహితీ పరిచయంలో కలిగినభావ ప్రకంపన స్పందనవలన నన్ను చాలా కాలం తరవాత చూడగానే కౌగిలించుకోవాలనిపించి ఉండవచ్చు. అది సాహిత్య మైత్రీ కౌగిలింత.

రెండు వేరు వేరు రసాల మేళవింపు కౌగిలింత జరిగింది.

ఒకసారి. విమానంలో నా సీటు పక్కన సుమారు 25 ఏళ్ల యువతి కూర్చుంది. ఎయిర్ హోస్టెస్ ఆ యువతికి సీటు బెల్టు పెట్టుకోమని చెప్పింది. ఆమె అర్థం కానట్టు మొహం పెట్టింది. హైదరాబాద్‌కు వెళ్తున్నాము కాబట్టి, ఆమెకి నేను తెలుగులో చెప్పాను.

"ఇది నా మొదటి విమాన ప్రయాణం." అని ఏడుపుగొంతుతో చెప్పింది.

"భయపడవద్దు, గంటలోపు మనం చేరుకుంటాం" అని చెప్పిన ఆమెకు సీటు బెల్టు పెట్టాను.

విమానం కదిలింది. నా చేతిని పట్టుకోవచ్చా అని అడిగింది. నా చేయి ఇచ్చాను. ఆమె గట్టిగా పట్టుకొంది. విమానం గాలిలోకి ఎగిరగానే ఏడుపు మొదలుపెట్టింది. ఆమెను ఓదార్చి, 'భయపడకు', అని సముదాయించాను. ఆమె నా భుజంపై తలవాల్చి, నన్ను గట్టిగా కౌగిలించుకుంది. నేను టీ తెప్పించి, ఆమెకు ఇచ్చాను. టీ తాగిన తర్వాత, ఆమె తన గురించి చెప్పింది. ఆమెది అనంతపురం సమీపంలోని ఒక పల్లెటూరు. ఆమె భర్త అహ్మదాబాద్‌లో చిన్న ఉద్యోగి. ఆ రోజు ఉదయం ఆమె తండ్రికి గుండెపోటు వచ్చింది. అందుకే బయలుదేరింది. ఒకవైపు తండ్రి గురించి బాధ మరొకవైపు మొదటిసారి విమానం ప్రయాణంలోని భయంతో సతమతమవుతున్న ఆమెకి నా కౌగలింత సాంత్వన కలిగించింది.

వివిధ జీవిత అనుభవాల భావోద్వేగాలకి లోనైనప్పుడు శరీరం కౌగిలింత కోరుకుంటుంది. మాటల్ని మించిన భావ ప్రకటన కౌగిలింత ద్వారా సాధ్యం.

జంతువుల నుంచి మనిషి దాకా లైంగిక కౌగిలింత జాతి కొనసాగడానికి ఎంతో అవసరం. మనుషుల్లో పశు ప్రవర్తన నుంచి అత్యంత వికాసం చెందిన మానవ ప్రవర్తన ఉన్న వారు ఉండే అవకాశం ఉంది. మనిషి తన బుద్ధితో వికసించిన మేధా సంపదతో హాయిగా జీవించడం మరిచిపోయి పశు ప్రవర్తన లోను కావడం వల్లనే కౌగిలింతకు అర్థం తెలుసుకోలేక తప్పుగా ఆలోచిస్తున్నారు.

అప్పుడే పుట్టిన పసికందు నుండి మరణ శయ్యపై ఉన్న వ్యక్తి వరకు, మనం ఎన్నో రకాల స్పర్శలను, ఎన్నో రకాల భావనలను అనుభవిస్తాం. ప్రతి స్పర్శకు ఒక అర్థం, ఒక భావన ఉంటుంది. అలాగే, ప్రతి కౌగిలింతకు ఒక కారణం, ఒక భావన ఉంటుంది.

జడ్జిగారూ, ఇన్నేళ్ల మీ జీవితంలో మీరూ ఎంతో మందిని కౌగిలించుకునే ఉంటారు. ఆ కౌగిలింతల్ని గుర్తుకు తెచ్చుకుంటే ఈమె నన్ను కౌగిలించుకున్న కౌగిలింత ఏ కౌగిలింతో మీకే బాగా అర్థం అవుతుంది."అన్నాడు.

కోర్టు ఎంత నిశ్శబ్దంగా ఉందంటే ఆవరణలో కదులుతున్న చెట్ల ఆకుల శబ్దం వినపడే అంత నిశ్శబ్దంగా ఉంది.

ఇప్పటిదాకా విన్న వాటిలో ఏ మాటలు అతన్ని చైతన్యవంతం చేశాయో కానీ అజంతా బొమ్మ భర్త ఒక్కసారి లేచి తలవంచుకుని నిలబడ్డాడు.

అత్తగారు తన అనుకున్న ఫీజు మొత్తం చెల్లించబోతున్నారని ఎదురుచూస్తున్న లాయరు, ఇవాళ వచ్చే విడాకులు తరువాత కొడుకు పెళ్లి చేయడం కోసం ఎదురుచూస్తున్న అత్తగారు, లేచి నిలబడ్డ భర్తని, కుర్చీలో నిశ్చలంగా ఉన్న జడ్జిని మార్చి మార్చి చూస్తున్నారు ఆశ నిరాశల ఊగిసలాటలో.

జడ్జి బోన్ లో ఉన్న అతన్ని మీరు వెళ్ళవచ్చు అన్నట్టు తన చేతితో సూచించారు.

పెన్ను తీసుకుని తలవంచి తను రాయవలసినది రాసి, తల ఎత్తి విడాకులు కోరడం కోసం ఇచ్చిన ఈ సాక్ష్యం ఉపయోగం లేనిదని, అందువల్ల ఇప్పుడు వీరికి విడాకులు ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు.

★ ★ ★ ★ ★

COMMENTS

★★★